

21 నుంచి ఆధ్యాత్మిక పర్యటన

● మంత్రి పీకే శేఖర్‌బాబు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పీకే శేఖర్ బాబు

అడయార్, సెప్టెంబరు 15: పురటాసి మాసంలో వైష్ణవాలయాల సందర్శన నిమిత్తం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 21, 28, అక్టోబరు 5, 12 తేదీ ల్లో ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభమవుతుందని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి పీకే శేఖర్‌బాబు వెల్లడించారు. ఓట్టేరిలోని సేమాత్తమ్మన్ ఆలయంలో రూ.1.58 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, వృద్ధుల కోరిక తీర్చేలా సీఎం స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వం ఆధ్యాత్మిక యాత్ర నిర్వహిస్తుందన్నారు. ఈ యాత్రంలో భాగంగా, రామేశ్వరం, కాశీ, ఆరు పుణ్యక్షేత్రాలు, ఆడి మాసంలో అమ్మవారి ఆలయాల సందర్శన, పురటాసి మాసంలో వైష్ణవాలయాల సందర్శన, మానస సరోవర్ యాత్ర, ముక్తినాథ్ ఆధ్యాత్మిక పర్యటన ఇలా వివిధ రకాల ఆధ్యాత్మిక యాత్రలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ యేడాది పురటాసి మాస ఆధ్యాత్మిక పర్యటనకు వెయ్యిమంది వృద్ధులను తీసుకెళుతున్నట్టు చెప్పారు.

గంగమ్మ ఒడికి గణనాథులు





నిమజ్జనం కోసం పట్టణంబాక్కం బీచ్‌కు తెచ్చిన విగ్రహాలు



తీరంలో భక్తుల కోలాహలం



క్రేన్ ద్వారా సముద్రంలోకి దించుతున్న విగ్రహం

రాజధాని నగరంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన సుమారు 1500 గ్రరహాలను 0 రోజుల పాటు పూజల అనంతరం ఆదివారం నిమజ్జనం చేశారు. విగ్రహాలను ఊరేగింపుగా సముద్ర తీరానికి తీసుకురాగా, భారీ క్రేన్ల సాయంతో నిమజ్జనం చేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సముద్రతీరంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించారు.

- ప్యారీస్

మళ్లీ వేడెక్కిన రాజకీయాలు ....

'కూటమి పాలన' తప్పులేదు

● ఎన్నికల సమయంలో చూసుకుందాం ● డీపీఐ అధినేత తిరుమావళవన్
● సీఎం నిర్ణయం: డీఎంకే ● తిరుమా వ్యాఖ్యలతో వారిలో భయం: అన్నాడీఎంకే



తిరుమావళవన్

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అధికార డీఎంకే మిత్రపక్షంగా వున్న డీపీఐ అధినేత తిరుమావళవన్ మళ్లీ 'కూటమి పాలన' తుట్టె కదిపారు. అలయన్స్ ప్రభుత్వ ఏర్పాటులో తప్పేముందంటూ రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారు. దీంతో రాష్ట్రంలో మళ్లీ రాజకీయ వేడి రాజుకుంది. రాష్ట్రంలో భాగస్వామ్య పార్టీలతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఎలాంటి తప్పులేదని తిరుమావళవన్ పునరుద్ఘాటించారు. తన వ్యాఖ్యలను రాజకీయ కోణంలో చూడవద్దని కూడా ఆయన సూచించారు. ఆయన ఆదివారం తిరుచ్చి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ.. 1977 నుంచి ఢిల్లీలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. అలాగే, భారతీయ జనతా పార్టీ పూర్తి మెజార్టీ సాధించినప్పటికీ భాగస్వామ్య పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని ఆయన గుర్తుచేశారు. అందువల్ల తమిళనాడులో కూడా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, లేదా అందుకోసం డిమాండ్ తెరపైకి తీసుకురావడంలో గానీ తప్పేముందని ప్రశ్నించారు. తాను 2016 నుంచే ఈ తరహా డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. ఇదే విషయంపై ఒక సదస్సు కూడా నిర్వహించామని, ఒక పుస్తకాన్ని కూడా విడుదల చేశామన్నారు. అధికారాన్ని పంచుకోవడమే నిజమైన ప్రజాస్వామ్యమవుతుందన్నారు. అధికారం అనేది ఒకే చోట కేంద్రీకృతం కారాదన్నారు. భాగస్వామ్య ప్రభుత్వ ఏర్పాటు అనేది పేద ప్రజలకు అధికారాన్ని చేరువ చేసే ఒక సాధనంగా భావించాలన్నారు. అందువల్ల కూటమి ప్రభుత్వం అంశాన్ని 2026 ఎన్నికల సమయంలో చూసుకోవచ్చని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు.

సీఎం నిర్ణయం తీసుకుంటారు : టీకేఎస్ ఇళంగోవన్

గత రెండు మూడు రోజులుగా కూటమి ప్రభుత్వ ఏర్పాటుపై తిరుమావళవన్ చేస్తున్న వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి స్టాలిన్ స్పందిస్తారని డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇళంగోవన్ పేర్కొన్నారు. తిరుమా చేస్తున్న అన్ని వ్యాఖ్యలకు సీఎం సరైన సమయంలో సరైన రీతిలో సమాధానం చెప్పడమే కాకుండా, తగిన నిర్ణయం తీసుకుంటారని ఆయన అన్నారు.

తిరుమా వ్యాఖ్యలతో డీఎంకేలో భయం : డి.జయకుమార్

కూటమి ప్రభుత్వ పాలన ఏర్పాటు అంశంపై తిరుమావళవన్ చేసిన వ్యాఖ్యలతో అధికార డీఎంకేలో భయం పుడుతోందని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ అన్నారు. ఆయన ఆదివారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. డీఎంకే కూటమిలోని భాగస్వామ్య పార్టీలు నీటిలో వెలిగించిన నిప్పులా ఉన్నాయన్నారు. ప్రభుత్వంలో, అధికారంలో భాగస్వామ్యం కావాలంటూ తిరుమావళవన్ చేసిన వ్యాఖ్యలు డీఎంకేలో భయాన్ని రేకెత్తించాయన్నారు. అదేసమయంలో డీపీఐ ఆధ్వర్యంలో జరిగే మద్య నిర్మూలన సదస్సు ఒక ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ మహానాడులో పాల్గొనాలని డీపీఐ నుంచి అధికారికంగా ఆహ్వానం వస్తే ఆలోచిస్తామని జయకుమార్ పేర్కొన్నారు.

ప్రభుత్వంలో స్థానం కోరడం తప్పేముంది? : ఆర్‌బీ ఉదయకుమార్

ప్రభుత్వంలో భాగస్వామ్యం కావాలని తిరుమావళవన్ కోరడంలో ఎలాంటి తప్పులేదని అన్నాడీఎంకే మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ వ్యాఖ్యానించారు. ఆయన ఆదివారం మదురైలో మీడియాతో మాట్లాడుతూ.. కూటమి అనే విధానాన్ని అన్నాదురై పరిచయం చేశారన్నారు. కూటమిలోని అన్ని పార్టీలకు అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛ స్వాతంత్ర్యం ఉందన్నారు. ఒక సదస్సు నిర్వహణ కోసం భద్రత దృష్ట్యా ఆంక్షలు విధించడం సర్వసాధారణమని, కానీ, నటుడు విజయ్ పార్టీ మహానాడే నిర్వహించకుండా ఆంక్షలు విధించడం విచిత్రంగా వుందన్నారు.

డీఎంకేకు తిరుమా దూరం కారు : స్పీకర్ అప్పావు

డీపీఐ ప్రధాన కార్యదర్శి తిరుమావళవన్ డీఎంకేకు దూరం కారని అసెంబ్లీ స్పీకర్ అప్పావు అభిప్రాయపడ్డారు. ఆయన ఆదివారం కన్నియాకుమారిలో మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో భాగస్వామ్యం కావాలని కోరుతున్న అంశంపై తిరుమావళవన్ వద్దే వివరణ కోరాలన్నారు. తిరుమా వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి స్టాలిన్ స్పష్టంగా వివరణ ఇచ్చారన్నారు. మద్య నిషేధంపై 2016లో విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో తాము స్పష్టంగా చెప్పామని స్పీకర్ అప్పావు ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఘనంగా అన్నాదురై జయంతి

● నేతల ఘననివాళి





అన్నాదురై చిత్రపటానికి మంత్రులతో కలసి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



అన్నాదురైకు నివాళులర్పిస్తున్న ఈపీఎస్ తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 15: దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి తదితర నేతలు ఘననివాళులర్పించారు. అన్నాదురై 116వ జయంతి సందర్భంగా అన్నాసాలై జంక్షన్‌లో ఉన్న ఆయన విగ్రహం దగ్గర ఏర్పాటుచేసిన అన్నాదురై చిత్రపటానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి స్టాలిన్ పూలుచల్లి నివాళులర్పించారు. ఇందులో మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, పొన్ముడి, ఐ.పెరియస్వామి, పీకే శేఖర్‌బాబు, పెరియకరుప్పన్, రాజమాణిక్యం, ఉదయనిధి సహా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొని దివంగత నేతకు నివాళులర్పించారు. అనంతరం నుంగంబాక్కం వళ్లువర్‌కోట్టంలో ఉన్న అన్నాదురై విగ్రహానికి మంత్రులతో కలసి సీఎం స్టాలిన్ పూలమాల వేసి అంజలి ఘటించారు. అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అన్నాసాలైలో అన్నాదురై విగ్రహానికి నివాళులర్పించారు. ఆ పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు డి.జయకుమార్, గోకుల ఇందిర, వలర్మతి, నత్తం విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు. అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, న్యూ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగం, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో తదితర నేతలు కూడా అన్నాదురైకు నివాళులర్పించారు.

ఏచూరికి స్టాలిన్ నివాళి



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు

పెరంబూర్, సెప్టెంబరు 15: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నివాళులర్పించారు. ఆదివారం దివంగత ముఖ్యమంత్రి అన్నాదురై జయంతి సందర్భంగా నుంగంబాక్కంలోని ఆయన విగ్రహం వద్ద ముఖ్యమంత్రి స్టాలిన్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి టీనగర్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన సీఎం.. అక్కడ ఏర్పాటుచేసిన సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, కేఎన్ నెహ్రూ, సీపీఎం నేత జి.రామకృష్ణన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంకీర్ణ పాలనకు అవకాశమే లేదు

వచ్చేది అన్నాడీఎంకే ప్రభుత్వమే: మాజీ మంత్రి సెల్లూరు రాజు



పెరంబూర్, సెప్టెంబరు 15: రాష్ట్రంలో సంకీర్ణ పాలనకు అవకాశమే లేదని అన్నాడీఎంకే మాజీ మంత్రి సెల్లూరు రాజు స్పష్టం చేశారు. మదురైలో ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన శక్తిగా అన్నాడీఎంకే పోటీచేస్తుందన్నారు. మాకు ప్రత్యర్థి డీఎంకే అని, మరే పార్టీ కూడా ఆ స్థాయిలో ఉండదని తెలిపారు. బీజేపీ మతవాదాన్ని అన్నాడీఎంకే ఎన్నటికీ అంగీకరించదన్నారు. తమ వరకు కూటమి అవసరం లేదని తెలిపారు. రెండేళ్ల డీఎంకే పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. డీఎంకే అధికారం చేపడితే అరాచకాలు పెరుగుతాయని చరిత్ర చెబుతోందన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కన్నా పలు రెట్లు ప్రతిభావంతుడిగా ఎడప్పాడి పళనిస్వామిని ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా పళనిస్వామి నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటు ఖాయమని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే, డీఎంకే పార్టీలు వంతులవారీగా అధికారం చేపట్టినా, కూటమి పార్టీలతో కలసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశమే లేదన్నారు. సంకీర్ణ ప్రభుత్వాలున్న రాష్ట్రాలు ఎలాంటి సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నాయో అందరికీ తెలిసిన విషయమేనన్నారు. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెట్టుబడుల సమీకరణకు అమెరికా సహా పలు దేశాలకు వెళ్లారని, కానీ, సీఎం స్టాలిన్ అమెరికా పయనం సరదాగా విహార యాత్రకు వెళ్లినట్లుగా ఉందని సెల్లూర్ రాజు ఎద్దేవా చేశారు.

ఉత్తరాఖండ్‌లో ప్రమాదం ..

రాష్ట్రానికి చెందిన 30 మంది సురక్షితం

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆది కైలాశ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో 30 మంది రాష్ట్రవాసులు చిక్కుకున్నారు. అదృష్టవశాత్తు వారంతా సురక్షితంగా బయటపడ్డారు. కడలూరు జిల్లా చిదంబరం నుండి ఈ నెల 1వ తేదీ ఉత్తరాఖండ్‌లో ఉన్న ఆదికైలాశ్ ఆధ్యాత్మిక, విహార యాత్రకు 30 మంది వెళ్లారు. ఇందులో 18 మంది పురుషులు, 12 మంది మహిళలున్నారు. ఆదికైలాశ్ దర్శనానంతరం వస్తుండగా, మార్గమధ్యలో కొండచరియలు విరిగిపడడంతో ఆ బృందం చిక్కుకుపోయింది. అలాగే వారు వెళ్లిన జీపులో పెట్రోల్ అయిపోవడంతో మార్గమధ్యంలోనే నిలిచిపోయారు. సమాచారం అందుకున్న అక్కడి భద్రతా సిబ్బంది.. వారందరినీ రక్షించి, సమీపంలో వున్న ఓ శిబిరానికి తరలించారు.



ఉత్తరాఖండ్‌లో చిక్కుకున్న రాష్ట్ర వాసులు

ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం మళ్లీ ఆ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడడంతో వారు శిబిరం నుండి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని చిదంబరంలో ఉన్న తమ బంధువులకు వారు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించారు. బంధువులు వెంటనే జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ మంత్రి ఎమ్మార్కే పన్నీర్ సెల్వం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి పన్నీర్‌సెల్వం, కలెక్టర్ ఆదిత్య సెంథిల్‌కుమార్ ఉత్తరాఖండ్ రాష్ట్ర అధికారులకు విషయం తెలిపారు. దీంతో, సైనికుల సాయంతో వారిని రక్షించే పనులు చేపట్టారు. తొలుత ఉదయం హెలికాప్టర్ ద్వారా 15 మందిని, సాయంత్రం మరో 15 మందిని బయటకు తీసుకువచ్చారు. వారందర్నీ విమానంలో చెన్నైకి తీసుకొచ్చేవిధంగా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

బాధితులతో మాట్లాడిన సీఎం ..

ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో రాష్ట్రానికి చెందిన భక్తులు చిక్కుకోవడంపై ముఖ్యమంత్రి స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రాష్ట్రంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితుల్లో ఓ మహిళకు ఫోన్ చేసిన ముఖ్యమంత్రి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాను అధికారులతో మాట్లాడానని, సాధ్యమైనంత త్వరగా స్వరాష్ట్రానికి తరలిస్తామని భరోసా ఇచ్చారు. కాగా తమ పట్ల తక్షణం స్పందించిన ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి పన్నీర్‌సెల్వంకు బాధిత మహిళ కృతజ్ఞతలు తెలిపింది.

వైగై డ్యాం నుంచి సాగునీరు విడుదల



డ్యాం నుంచి నీరు విడుదల చేస్తున్న మంత్రి మూర్తి

పెరంబూర్, సెప్టెంబరు 15: తేని జిల్లా ఆండిపట్టి సమీపంలోని 71 అడుగుల సామర్థ్యం కలిగిన వైగై డ్యాం ప్రస్తుత నీటి మట్టం 62 అడుగులుంది. ఈ డ్యాం నుంచి మదురై, దిండుగల్ జిల్లాలకు జూన్ నుంచి సాగునీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం దిండుగల్, శివగంగ జిల్లాల్లో తొలి దశ సాగు కోసం ఆదివారం నుంచి నీరు విడుదల చేస్తున్నట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల ప్రకటించారు. ఆ ప్రకారం, ఆదివారం ఉదయం రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ మంత్రి మూర్తి డ్యాం నుంచి నీటిని విడుదల చేశారు. పెరియారు ఆయకట్టు, తిరుమంగళం ప్రధాన కాలువ పరిధిలోని భూములకు ఆదివారం నుంచి 120 రోజులు 8,461 మిలియన్ ఘనపుటడుగుల నీరు విడుదల చేయనున్నట్టు, ఈనీటితో దిండుగల్ జిల్లాలోని నీలకోట, మదురై జిల్లాలోని వాడిప్పాడి, మేలూరు, మదురై ఉత్తరం, తిరుమంగలం, శివగంగ జిల్లాలోని తిరుపత్తూర్, శివగంగ తదితర ప్రాంతాల్లోని 1.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

నీట మునిగి ఐదుగురి మృతి



కల్లనై నది కాలువలో గల్లంతైన సురేష్ కోసం గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెరంబూర్, సెప్టెంబరు 15: రాష్ట్రంలో ఆదివారం సంభవించిన వేర్వేరు ఘటనలో నీటమునిగి ఐదుగురు మృతిచెందారు. తిరునల్వేలి జిల్లా మున్నీర్‌పాళయం సమీపం పీఎస్ఎన్ కాలేజి వెనుక ఉన్న తామ్రభరణి నది కాలువలో స్నానాలకు వెళ్లిన ముగ్గురు నీటమునిగి మృతిచెందారు. ప్లస్ టూ చదువుతున్న అరుణ్ కుమార్, నిఖిల్, అంద్రూస్ కాలువలో స్నానానికి వెళ్లిన సమయంలో లోతైన ప్రాంతానికి వెళ్లిన నీటమునిగారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకుని అరుణ్‌కుమార్, అంద్రూస్ మృతదేహాలు వెలికితీసి, గల్లంతైన మరో విద్యార్థి నిఖిల్ కోసం గాలిస్తున్నారు.

తిరువెరుంబూర్‌లో...

తిరువెరుంబూర్ ప్రాంతానికి చెందిన సురేష్ తన కుమార్తెలు కృతిక (13), యాషిక (6)లతో కలసి కల్లనై నది కాలువలో స్నానానికి వెళ్లాడు. ఆ సమయంలో ఊహించని విధంగా యాషిక నీటిలో కొట్టుకుపోవడాన్ని గమనించిన సురేష్ ఆమెను రక్షించేందుకు ప్రయత్నించగా, ఆయన కూడా నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని యాషిక మృతదేహాన్ని వెలికితీసి, గల్లంతైన సురేష్ కోసం గాలిస్తున్నారు.

సమాచార ధ్వని

6న నగరంలో 'ఎయిర్ షో'

ఐసిఎఫ్, సెప్టెంబరు 15: భారత వైమానిక దళం 92వ వార్షికోత్సవం సందర్భంగా మెరీనా తీరంలో తొలిసారిగా అక్టోబరు 6వ తేది వైమానిక దళ విన్యాసాలు జరుగనున్నాయి. మూడేళ్లుగా డిల్లీలో మాత్రమే నిర్వహిస్తున్న ఈ విన్యాసాలు తొలి సారిగా చెన్నైలో నిర్వహించనున్నారు. ఈప్రదర్శనలో తేజాస్, రఫేల్, సుఖోయ్ సహా పలు యుద్ధవిమానాలతో విన్యాసాలు జరుగనున్నాయి. ఉదయం 11గంటలకు జరిగే ఈకార్యక్రమంలో ప్రజలు ఉచితంగా పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

19 ప్రాంతాల్లో రూ.35కే కిలో ఉల్లి

ఐసిఎఫ్, సెప్టెంబరు 15: నగరంలోని చిల్లర దుకాణాల్లో కిలో ఉల్లి రూ.50 వరకు పలుకుతోంది. ప్రజలకు ఉల్లి కిలో రూ.35కు విక్రయించేలా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేది సంచార విక్రయ దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఆ ప్రకారం, మైలాపూర్ లజ్ కార్నర్, తేనాంపేట, పోరూర్, తాంబరం, ట్రిప్లికేన్, పార్థసారథి ఆలయం, ఆలందూర్ మెట్రో, టీనగర్, మెప్స్ సిగ్నల్, అళ్వార్‌పేట, గిండి తాలూకా, కీల్పాక్కం మెట్రో, సెంట్రల్ రైల్వేస్టేషన్, అన్నానగర్, కోయంబేడు బస్టాండ్, వేళచ్చేరి, సైదాపేట, కొళత్తూర్ ప్రాంతాల్లో సంచార వాహనాల ద్వారా కిలో ఉల్లి రూ.35కు విక్రయిస్తున్నట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరఫరాల శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

న్యాయవాది పరీక్షకు ఉచిత శిక్షణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 15: ప్రభుత్వ క్రిమినల్ న్యాయవాది పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు చెన్నై కార్పొరేషన్ మాజీ మేయర్ సైదై దురైస్వామి విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ ప్రకటన మేరకు, 51 ప్రభుత్వ సహాయ క్రిమినల్ న్యాయవాదుల పోస్టుల భర్తీకి నిర్వహించనున్న రాతపరీక్షకు ఈ నెల 21వ తేది నుంచి ఉచిత శిక్షణ అందించనున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 044-24358373, 9840439393, 8428431107 అనే నెంబర్లు సంప్రదించి పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు.

30, 1న టిటోజాక్ సచివాలయం ముట్టడి

ఐసిఎఫ్, సెప్టెంబరు 15: తమిళనాడు ప్రాథమిక విద్య ఉపాధ్యాయుల సంఘాల సమాఖ్య (టిటోజాక్) ఆధ్వర్యంలో ఈ నెల 30, అక్టోబరు 1వ తేదీల్లో సచివాలయం ముట్టడి చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ సంఘ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో... ప్రాథమిక విద్య ఉపాధ్యాయులకు సంబంధించిన 31 అంశాలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10న సమ్మె చేపట్టామన్నారు. దీనిపై స్పందించిన మంత్రి, సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయుల సంఘాల ప్రతినిధులతో చర్చలు జరుపుతారని ప్రకటించినా, ఇంతవరకు చర్చలకు ఆహ్వానించలేదన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 19,20 తేదీల్లో అన్ని పార్టీల నేతలను కలసి వినతిపత్రాలు అందజేత, 23,24 తేదీల్లో ఆందోళన సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించని పక్షంలో 30, 1వ తేదీల్లో సచివాలయం ముట్టడి చేపడతామని టిటోజాక్ హెచ్చరించింది.

కాల్వల పూడికతీతకు రూ.3.42 కోట్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 15: చెంగల్పట్టు నగరంలో కాలువల పూడికతీతకు రూ.3.42 కోట్లు కేటాయించారు. నగరంలోని జేసీకే నగర్, నత్తం, మేట్టు వీధి, వేదాచలం నగర్, అనుమంతపుత్తేరి, అళగేశన్ నగర్, అన్నా నగర్ తదితర ప్రాంతాల్లోని వాననీటి కాలువల్లో వ్యర్థాలు చేరి కాలువలు పూడుకుపోయాయి. వర్షాల సమయంలో నీరు వెళ్లే దారి లేక ముంచెత్తే అవకాశముందని ఆ ప్రాంత ప్రజలు చెంగల్పట్టు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన అధికారులు, సంబంధిత ప్రాంతాల్లోని కాలువల పూడికతీతకు రూ.3.42 కోట్లు కేటాయించి, వర్షాలు ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తిచేయనున్నట్లు తెలిపారు.

21కి అన్నాడీఎంకే సభ వాయిదా

ఐసిఎఫ్, సెప్టెంబరు 15: అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మధురవాయ్‌లో ఆదివారం జరగాల్సిన బహిరంగ సభ ఈ నెల 21వ తేదీకి వాయిదాపడింది. అన్నాదురై 116వ జయంతి సందర్భంగా మధురవాయల్ ఉత్తరం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పాల్గొంటారని ఇదివరకే పార్టీ ప్రకటించింది. ఈ క్రమంలో, తిరువళ్లూర్ సెంట్రల్ జిల్లా పార్టీ కోశాధికారి జావిద్ అహ్మద్ ఆకస్మిక మృతితో, ఆదివారం జరగాల్సిన బహిరంగ సభ ఈ నెల 21వ తేదీకి వాయిదావేసినట్లు పార్టీ ప్రధాన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

నేడు ఎంఎంకే టోల్ ప్లాజాల ముట్టడి

ఐసిఎఫ్, సెప్టెంబరు 15: రాష్ట్రంలో కాలపరిమితి ముగిసిన టోల్‌ప్లాజాలను వెంటనే మూసివేయాలని కోరుతూ మనిదనేయ మక్కల్ కట్చి (ఎంఎంకే) ఆధ్వర్యంలో సోమవారం ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు జవాహిరుల్లా విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని టోల్‌ప్లాజాల్లో రోజుకు రూ.50 కోట్లు, ఏడాదికి రూ.18 వేల కోట్ల వరకు కొల్లగొడుతున్నారన్నారు. కాలపరిమితి ముగిసినా ఇంకా పనిచేస్తున్న భరనూరు, పల్లికొండ, కరుమత్తంపట్టి, తువాకుడి, కప్పలూరు, నాంగునేరి తదితర ఏడు టోల్‌ప్లాజాలు మూసివేయాలని కోరుతూ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

234 లక్ష్యం...200 గ్యారంటీ...!

● మంత్రి రఘుపతి

పెరంబూర్, సెప్టెంబరు 15: రాబోయే శాసనసభ ఎన్నికల్లో 234 నియోజకవర్గాలు చేజిక్కించుకోవాలని లక్ష్యంగా నిర్ణయించామని, కనిష్ఠంగా 200 స్థానాల్లో తప్పక విజయం సాధిస్తామని న్యాయ శాఖ మంత్రి రఘుపతి తెలిపారు. డీఎంకే పుదుకోట జిల్లా నిర్వాహకుల సమావేశం కులత్తూర్‌లో శనివారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... డీఎంకే ఎప్పుడూ ఒక లక్ష్యంతో ఎన్నికల్లో పోటీచేస్తుందన్నారు. గత లోక్ సభ ఎన్నికల్లో ముందుగానే లక్ష్యం నిర్ణయించి పోటీచేయగా, 40 స్థానాలను డీఎంకే చేజిక్కించుకుందని తెలిపారు. ఇంత ఘనవిజయం సాధించినా 'ఇండియా' కూటమి అధికారం చేపట్టలేకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యకర్తలను నమ్మి డీఎంకే పనిచేస్తుందన్నారు. డీఎంకే ఘనవిజయాలకు కార్యకర్తల సమష్టి కృషే కారణమని మంత్రి తెలిపారు.

20న శ్రీలంక ప్రభుత్వ తీరుపై సీపీఎం ధర్నా

పెరంబూర్, సెప్టెంబరు 15: జాలర్లకు గుండు గీసి పంపించిన శ్రీలంక ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 20వ తేది రామేశ్వరంలో ధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి కె.బాలకృష్ణన్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన రామేశ్వరం జాలర్లను విడుదల చేస్తూ ఆ దేశంలోని న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. జాలర్లను రాష్ట్రానికి పంపే సమయంలో శ్రీలంక అధికారులు వారికి గుండు గీయించి పంపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, శ్రీలంక ప్రభుత్వ తీరును నిరసిస్తూ రామేశ్వరంలో ధర్నా చేపట్టనున్నట్లు బాలకృష్ణన్ తెలిపారు.

ప్రకృతి పరమాత్ముడి వరప్రసాదం

● ఎంసీటీబీసీలో కోతకాలం వేడుకలు



కోతకాలం పండుగలో పాల్గొన్న సీనియర్ ఫాస్టర్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 15: ప్రకృతి పరమాత్ముడి వరప్రసాదంగా మానవునికి ప్రసాదించడబడిందని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి (ఎంసీటీబీసీ) కాపరి రెవ డా. ఎస్.రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వెప్పేరి హైరోడ్డులోని సంఘ ప్రాంగణంలో ఆదివారం ఆరాధన అనంతరం కోతకాలపు పండుగ ఘనంగా నిర్వహించారు. కాపరి రాజేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా రెవ వెంకట్ రావు ఎల్ల పాల్గొని దైవ సందేశం అందించారు. సంఘ అధ్యక్షుడు జి.రామయ్య, కార్యదర్శి పోతల ప్రభుదాస్, కోశాధికారి ఏ.బాబు, వివిధ కమిటీల సభ్యులు, స్త్రీల సమాజం, యూత్, సండే స్కూల్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రసాయనాలు లేకుండా సహజసిద్ధంగా పండించిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో ఏర్పాటు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకు ంది. ఈసందర్భంగా కాపరి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రకృతిలో ఆయా సందర్భాల్లో దేవుడు చేసిన ఉపకారాలను జ్ఞాపకం చేసుకుని, పది మందితో కలిసి ఐకమత్యంతో సంతోషించడానికి మానవులకు ఇచ్చిన అవకాశమే పండుగలు అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరమాత్ముడిగా భావించి, ఆరాధించాలని ముఖ్యంగా నీటి వనరులను సంరక్షించడంలో తమ వంతు భాగస్వామ్యం పంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఓనం పండుగ ఎఫెక్ట్....

కోయంబేడులో అరిటాకుల కట్ట రూ.6 వేలు

ప్యారీస్, సెప్టెంబరు 15: ఓనం పండుగ, శుభ ముహూర్తాలు రోజైన ఆదివారం కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్లో అరిటాకుల విక్రయాలు జోరుగా సాగింది. ఎన్నడూ లేని విధంగా అరికటాల కట్ట రూ.6,000లకు పెరిగింది. దీనిపై మార్కెట్ వ్యాపారుల సంఘ అధ్యక్షుడు ముత్తుకుమార్ మీడియాతో మాట్లాడుతూ... కోయంబేడు మార్కెట్లో రెండు రోజుల క్రితం వరకు పూలు, పండ్లు, కూరగాయల ధరలు సరసమైన ధరలకే విక్రయించామని, అయితే శ్రావణ మాసం చివరి రోజులు, శుభ ముహూర్తాల రోజు కావడం, మరోవైపు ఓనం పండుగ సందర్భంగా ధరలు పెరిగాయని తెలిపారు. తంజావూరు, తూత్తుకుడి, పుదుకోట తదితర జిల్లాల నుంచి నెల్లూరు, చిత్తూరు, కడప తదితర ప్రాంతాల నుంచి అతితక్కువగా కూరగాయలు, పూజా సామగ్రి రావడంతో ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు.

దీపం వెలిగిస్తుండగా నిప్పంటుకొని యువతి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 15: దీపం వెలిగిస్తున్న ఘటనలో కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న యువతి మృతిచెందిన ఘటన అరియలూరు జిల్లాలో చోటు చేసుకుంది. జయంకొండాం సమీపం కరడికుళం గ్రామానికి చెందిన అప్పాదురై కుమార్తె శోభన, ఘటన జరిగిన రోజున ఇంట్లో దీపం వెలిగించింది. ఆ సమయంలో ఊహించని విధంగా ఆమె చీరకు నిప్పంటుకొని మంటలు వ్యాపించాయి. ఆమె కేకలతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని మంటలార్పి వెంటనే జయంకొండాం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం తంజావూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక ఆదివారం ఉదయం ఆమె మృతిచెందింది. ఈ ఘటనపై జయంకొండాం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అన్నామలైని కలిసి వివరణ ఇస్తా

● బీజేపీ బహిష్కృత నేత సతీష్ వెల్లడి

అడయార్, సెప్టెంబరు 15: జీఎస్టీ వివాదంపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వద్ద కోయంబత్తూరులోని అన్నపూర్ణ హోటల్ యజమాని శ్రీనివాసన్ క్షమాపణ కోరిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియోను షేర్ చేసింది బీజేపీ నేత సతీష్ అని తేలడంతో ఆయన్ను పార్టీ నుంచి తొలగించారు. ఈ అంశంపై సతీష్ స్పందిస్తూ, ఈ వీడియో అంశంపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైని కలిసి వివరణ ఇస్తానని తెలిపారు. పెను వివాదానికి కారణమైన వీడియో తీసిన సమయంలో అక్కడ ఉన్నది నలుగురు లేదా ఐదుగురు మాత్రమేననాన్నరు. నిజం చెప్పాలంటే ఆ వీడియోలో ఏముందో కూడా తనకు స్పష్టంగా తెలియదన్నారు. ఈ వీడియో ఎవరు తీశారంటూ తనను ప్రశ్నించారని, దీంతో ఆ వీడియో తీసింది ఎవరన్న దానిపై తాను ఆరా తీయడంలో భాగంగా ఇతరులకు షేర్ చేశానని చెప్పారు. కానీ, ఆ వీడియోను తానే షేర్ చేసినట్టుగా భావించి సస్పెండ్ చేశారన్నారు. వాస్తవం చెప్పాలంటే, ఆ వీడియో తీసిన వారిపై పార్టీ క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

2026లో సీఎం కుర్చీలో విజయ్

● బుస్సీ ఆనంద్ జోస్యం

అడయార్, సెప్టెంబరు 15: వచ్చే 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ముఖ్యమంత్రి కుర్చీలో అగ్రహీరో, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ కూర్చొంటారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బుస్సీ ఆనంద్ జోస్యం చెప్పారు. ఇదే విషయంపై ఆయన తంజావూరులో మీడియాతో మాట్లాడుతూ, 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి కుర్చీలో ఖచ్చితంగా విజయ్ కూర్చొంటారన్నారు. ఇందుకోసం పార్టీ నేతలు, కార్యకర్తలు శ్రమించాలని కోరారు. విజయ్ 69వ చిత్రం రాజకీయ చిత్రమా లేదా వినోదాత్మక చిత్రమా అని ప్రశ్నిస్తున్నారని, ఈ విషయంపై ఇపుడే స్పష్టత ఇవ్వలేమన్నారు.

ఆర్థికమంత్రిని లక్ష్యంగా చేసుకునే విమర్శలు

● ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్

అడయార్, సెప్టెంబరు 15: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను లక్ష్యంగా చేసుకునే డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయని బీజేపీ మహిళా నేత, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ వ్యాఖ్యానించారు. నిర్మలా సీతారామన్ కోయంబత్తూరు పర్యటన సందర్భంగా చెలరేగిన వివాదంపై వానతి శ్రీనివాసన్ స్పందిస్తూ, సామాజిక న్యాయం కోసం పదేపదే మాట్లాడే డీఎంకే.. ఆ పార్టీ అధికారంలో ఉన్నపుడు అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఈ అంశంపై ఊసెత్తడం లేదన్నారు.

కూటమి ప్రభుత్వం అంటే రెండు మంత్రి పదవులు కాదు: కె.బాలకృష్ణన్

అడయార్, సెప్టెంబరు 15: కూటమి ప్రభుత్వం అంటే రెండు మంత్రిపదవులు తీసుకుని అధికారంలో భాగస్వామి కావడం కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే 2026లో జరిగే ఎన్నికల్లో డీఎంకే కూటమిలోని పార్టీలు అధిక సీట్లను కేటాయించాలని డిమాండ్ చేయడంలో తప్పులేదన్నారు. కానీ, డీఎంకే స్వతంత్ర మెజార్టీకి ఎలాంటి ఢోకా లేదన్నారు. అదేసమయంలో ప్రతి పార్టీ అధికారంలోకి కావాలన్న ఆకాంక్ష ఉంటుందన్నారు. ఇందుకోసం రెండు మంత్రి పదవులు తీసుకుని ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం వల్ల ప్రయోజనం లేదన్నారు. ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తేనే దానికి అర్థం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

ఏచూరికి నివాళి



ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం శ్రేణులు

వేలూరు, సెప్టెంబరు 15: స్థానిక పాత బస్టాండ్‌లో ఇటీవల మృతిచెందిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించే కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పళని పాల్గొని, ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పూంగోడి మూర్తి, కరుణ, సుందరేశ్, దేవరాజ్, మహాలింగం, మూర్తి, ఎలక్ట్రీషియన్ కరుణ, మనోహరన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంకే కుల పార్టీ కాదు

● అన్బుమణి రాందాస్

ప్యారీస్, సెప్టెంబరు 15: తమది ఒక కుల పార్టీ కాదని, శ్రామిక వర్గాలకు చెందిన ప్రజల సంక్షేమం కోసం స్థాపించినదని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన ఆదివారం మదురై వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో మాదకద్రవ్యాల కారణంగా యువత జీవితాలు నాశనమవుతున్నాయని, అయినప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు రాష్ట్రంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు వివిధ దేశాల నుంచి వలస పక్షులు పెద్ద సంఖ్యలో వస్తుంటాయని గుర్తుచేశారు. అయితే, నీటి వనరుల్లో పెరుగుతున్న ఆక్రమణల తొలగింపు, పర్యావరణాన్ని కాలుష్యం చేస్తున్న సంస్థలను, అక్రమంగా పొగాకు ఉత్పత్తులు విక్రయించేవారిపై చర్యలు తీసుకునేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు తెలియదా అని ప్రశ్నించారు. డీపీఐ నేత తిరుమావళవన్ వ్యాఖ్యానించినట్టుగా పీఎంకే ఒక కుల పార్టీ కాదనీ, ఇస్లామీయులను ఎంబీసీ జాబితాలో చేర్పించి, వారికి ఆరుశాతం రిజర్వేషన్ కల్పించింది తాను కేంద్రమంత్రిగా ఉన్న సమయంలోనేనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. డీఎంకేకు చెందిన ఎంపీలైన టీఆర్‌బాలు, జగద్రక్షన్‌లకు చెందిన ఫ్యాక్టరీల నుంచే రాష్ట్రంలోని టాస్మాక్ దుకాణాలకు అవసరమైన 40 శాతం మద్యం సరఫరా చేస్తున్నారని, అందువల్లే రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధ చట్టాన్ని అమలు పరచలేకపోతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

వైభవంగా శివశక్తి వినాయకుడికి పూజలు



నిమజ్జనంలో తెలుగు వారు

ప్యారీస్, సెప్టెంబరు 15: స్థానిక చూళై కాట్టూరు సల్లముత్తు వీధిలో హిందూ మున్నని సెంట్రల్ చెన్నై జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓం శ్రీ శివశక్తి వినాయకుడి విగ్రహ నిమజ్జనం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ నెల 7వ తేదీ ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహానికి 9 రోజుల పాటు విశేష పూజలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం వినాయకుడికి నివేదించిన లడ్డు వేలం వేశారు. అనంతరం నిర్వాహకులు పసుమర్తి శ్రీనివాసన్, పసుమర్తి బాబు, జయరావు, నాగయ్య, రామారావు, గోవిందరాజులు, కృష్ణ, పరచు వెంకట రమణయ్య, పోలయ్య తదితరులు డప్పు చప్పుళ్లు, మేళతాళాల మధ్య నిమజ్జనం ఊరేగింపులో పాల్గొన్నారు.

అన్నాదురైకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సునీల్ తదితరులు

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి సీఎన్ అన్నాదురై 116వ జయంతిని పురస్కరించుకుని అన్నాడీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఆ విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ నేతృత్వంలో టీనగర్‌లోని ఆయన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు దివంగతనేత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ప్రజలకు చేసిన సేవల్ని నేతల్ని కొనియాడారు.

పిల్లలకు వచ్చే క్యాన్సర్‌పై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబరు 15: స్థానిక ఆరణి రోడ్డులోని సీఎంసీ కంటి ఆస్పత్రిలో పిల్లలకు వచ్చే క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమాన్ని తమిళగ వెట్రి కళగం జిల్లా అధ్యక్షుడు, ఆర్గనైజర్ వేల్‌మురుగన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఓటీ ట్రస్టీ సునీల్‌కుమార్, పార్టీ నిర్వాహకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించే కరపత్రాలు అందజేశారు.

ట్రస్ట్‌కు బ్యాటరీ వాహనం విరాళం



ట్రస్ట్ నిర్వాహకులకు వాహనం అందజేస్తున్న శక్తి అమ్మ

వేలూరు, సెప్టెంబరు 15: ఆంబూరులోని ఫుడ్ బ్యాంక్ ట్రస్ట్‌కు స్థానిక మలైకోడి శ్రీపురం నారాయణి పీఠం తరపున శక్తి అమ్మ రూ.3 లక్షల విలువైన మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న ట్రస్ట్‌ను అభినందందింగడంతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.

వలత్తూర్‌లో రేషన్ గ్రీవెన్స్



వినతిపత్రాలు సమర్పిస్తున్న ప్రజలు

వేలూరు, సెప్టెంబరు 15: గుడియాత్తం డివిజన్ వలత్తూర్ సమీపం ఉల్లిగ్రామం, మధురాపట్టువామ్ తదితర గ్రామాల్లో ఆదివారం రేషన్ గ్రీవెన్స్ జరిగింది. రేషన్ కార్డుల్లో పేర్లు చేర్పు, తొలగింపు, టెలిఫోన్ నెంబరు, చిరునామా మార్పు తదితరాలకు సంబంధించి ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నిర్వాహ అధికారి పెరియస్వామి, పంచాయతి సర్పంచ్ జయశంకర్, ఉప సర్పంచ్ సతీష్‌కుమార్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో

69,212 కేసుల పరిష్కారం

● రూ.682 కోట్ల నష్టపరిహారం



లోక్ అదాలత్‌లో బాధితులకు పరిహారం అందజేస్తున్న న్యాయమూర్తులు

పెరంబూర్, సెప్టెంబరు 15: రాష్ట్రవ్యాప్తంగా శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 69,212 పెండింగ్ కేసులు పరిష్కారమయ్యాయి. ఈ అదాలత్ ద్వారా బాధితులకు సుమారు రూ.682 కోట్ల నష్టపరిహారం అందింజేశారు. మద్రాసు హైకోర్టు న్యాయపనుల కమిషన్ ఆధ్వర్యంలో మద్రాసు హైకోర్టులో ఆరు ధర్మాసనాలు, మదురై డివిజన్ బెంచ్‌లో మూడు ధర్మాసనాల్లో లోక్ అదాలత్ జరిగింది. మద్రాసు హైకోర్టులో 1,022 కేసులకు గాను 149 కేసులు పరిష్కరించి, రూ.18.85 కోట్ల పరిహారం అందజేశారు. మదురై డివిజన్ బెంచ్‌లో 356 కేసులకు 30 కేసులు పరిష్కరించి, రూ.4 కోట్ల పరిహారం అందజేశారు. అలాగే, జిల్లా న్యాయపనుల కమిషన్ సభ్యులు, తాలూకా న్యాయసేవా విభాగాలు సంయుక్తంగా 475 లోక్ అదాలత్‌లు నిర్వహించి 69,033 కేసులు పరిష్కరించి, రూ.660.26 కోట్ల నష్టపరిహారం అందజేశారు. ఆ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో 69,212 కేసులు పరిష్కరించి, బాధితులకు రూ.682 కోట్ల పరిహారం అందజేశారు. అన్ని జిల్లాల్లో నిర్వహించిన లోక్ అదాలత్ ఏర్పాట్లను రాష్ట్ర న్యాయ వ్యవహారాల కమిషన్ మెంబర్ సెక్రటరీ, జిల్లా జడ్జి ఎ.నసీర్ అహ్మద్, హైకోర్టు న్యాయ వ్యవహారాల కమిషన్ కార్యదర్శి, జిల్లా జడ్జి కె.సుధ పర్యవేక్షించారు.

సాంకేతిక లోపంతో నిలిచిన మెట్రోరైళ్లు



పెరంబూర్, సెప్టెంబరు 15: స్థానిక వింకోనగర్ - విమానాశ్రయం మధ్య సాంకేతిక లోపం ఏర్పడడంతో ఎక్కడికక్కడే రైళ్లు నిలిచిపోయాయి. నగరంలో వింకో నగర్-విమానాశ్రయం, సెంట్రల్-సెయింట్ థామస్ మౌంట్ మధ్య రెండు మార్గాల్లో మెట్రోరైళ్లు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, వింకోనగర్-విమానాశ్రయం మధ్య హఠాత్తుగా సాంకేతికలోపం ఏర్పడింది. దీంతో ఈ మార్గంలో సెంట్రల్-విమానాశ్రయం మధ్య నడుస్తున్న రైళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న నిపుణులు, సిబ్బంది సాంకేతికలోపం సరిచేశారు. ఈ విషయమై సీఎంఆర్ఎల్ తన ఎక్స్ పేజీలో... 'సాంకేతికలోపం సరిచేయబడింది. బ్లూ లైన్‌లో ఉన్న వింకోనగర్ డిపో-విమానాశ్రయం మధ్య మెట్రోరైలు సేవలు యథావిధిగా సాగుతున్నాయి. ప్రయాణికులకు ఏర్పడిన ఇబ్బందికి చింతిస్తున్నాం' అంటూ పోస్ట్ చేసింది.

అమ్మో.... సాగర కన్యలు...!



పెరంబూర్, సెప్టెంబరు 15: రంగు రంగుల చేపలతో కూడిన గాజు తొట్టెలో నలుగురు సాగర కన్యలు ఈత కొడుతున్న దృశ్యాలు ప్రేక్షకులను మంత్ర ముగ్దులను చేస్తున్నాయి. కోయంబత్తూర్ వావూసీ పార్క్ మైదానంలో తొలిసారిగా బ్రహ్మాండమైన రంగురంగుల చేపల ప్రదర్శన ఏర్పాటైంది. సముద్రం కింద అద్దాలతో భారీ గుహలా ఏర్పాటుచేసి రంగు రంగుల చేపలు వదిలారు. గుహ లోపల నుంచి వెళ్లే ప్రేక్షకులు సముద్రం మధ్యలో రంగు రంగు చేపల మధ్య నడిచివెళ్తున్న అనుభూతి పొందుతున్నారు. ప్రేక్షకులకు మరింత ఆహ్లాదం కలిగించేలా నలుగురు యువతులు సాగరకన్యల వేషంలో అద్దాల పెట్టెలో ఈతకొడుతున్నారు. ఈ ప్రదర్శన దీపావళి వరకు కొనసాగుతుందని, ప్రవేశ రుసుము రూ.100 వసూలుచేస్తున్నట్లు ప్రదర్శన ఆర్గనైజర్ చిట్టిబాబు తెలిపారు.

దేవనాథస్వామి ఆలయంలో ఒకేరోజు వంద వివాహాలు



ఆలయ మండపంలో వివాహాల సందడి

పెరంబూర్, సెప్టెంబరు 15: కడలూరు జిల్లా తిరువందిపురం దేవనాథస్వామి ఆలయం 108 వైష్ణవ ఆలయాల్లో అగ్రగామిగా ఉంది. ఈ ఆలయం ఎదురుగా కొండపై ముహూర్తపు రోజుల్లో అధికంగా వివాహాలు జరుగుతుంటాయి. దీంతో, హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో తిరువందిపురంలో కొత్త కల్యాణ మండపం నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో, సోమవారం ఆవణి మాసం ముగిసి, మరుసటి రోజు పురటాసి మాసం ప్రారంభం కానుంది. దీంతో, ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే ఆలయ ప్రాంగణంలో వివాహాలు జరిగాయి. వధూవరుల కుటుంబసభ్యులు, బంధువు, స్నేహితులతో ఆలయ ప్రాంగణం, పరిసరాలు కిక్కిరిసి కనిపించాయి. ఆలయ కల్యాణ మండపంలో 75 వివాహాలు, ఆ ప్రాంతంలోని ప్రైవేటు కల్యాణ మండపాల్లో 25 మొత్తం ఒకేరోజు 100 వివాహాలు జరిగాయి. వివాహానంతరం వధూవరులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తిరుపాదిరిపులియూర్ పోలీసులు బందో బస్తు చేపట్టారు.

కిక్కిరిసిన కాశిమేడు చేపల మార్కెట్



చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

పెరంబూర్, సెప్టెంబరు 15: స్థానిక కాశిమేడు చేపల మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో చేపల కొనుగోలుకు వచ్చిన ప్రజలతో మార్కెట్ పండుగ వాతావరణాన్ని తలపించింది. తెల్లవారుజాము నుంచే ప్రజలు మార్కెట్‌కు చేరుకొని చేపలు కొనుగోలు చేశారు. చేపల వేటకు సముద్రంలో వెళ్లిన జాలర్లు వంజరం, వవ్వాల్, పాల్ సురా, తిరుక్కై, పారై, షీలా, శంకర తదితర చేపలతో మార్కెట్‌కు తిరిగొచ్చారు. దీంతో, ప్రజలు పెద్దసంఖ్యలో మార్కెట్‌కు చేరుకొని చేపలు కొనుగోలు చేసి వెళ్లారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ సత్యానందం

వేలూరు, సెప్టెంబరు 15: కొండాసముద్రం పంచాయతి పాండ్యన్ నగర్ పిళ్లయార్ ఆలయ వీధిలో ఫేవర్ బ్లాక్ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం పంచాయతి సర్పంచ్ సత్యానందం పరిశీలించారు. ఆయన వెంట అఖిలాండేశ్వరి, ప్రేమ్ కుమార్, తాటిమాన్‌పల్లి పంచాయతి సర్పంచ్ సత్యదాసన్, అన్నాదొరై తదితరులున్నారు.

వైభవంగా అఘోర లింగేశ్వరాలయ కుంభాభిషేకం



మహా కుంభాభిషేకంలో అఘోరి గురురామరాజ్

వేలూరు, సెప్టెంబరు 15: స్థానిక కాట్పాడి తాలూకా బ్రహ్మపురం సెంజి రాయమలై సమీపంలోని కాశీ అఘోర లింగేశ్వరాలయ మహాకుంభాభిషేకం ఆదివారం జరిగింది. వేడుకల్లో భాగంగా మహాగణపతి హోమం, నవగ్రహ హోమం, మహాలక్ష్మి హోమం, పూర్ణాహుతి, గోపూజ, వాస్తు హోమం, అలంకారం, యాగశాల పూజలు నిర్వహించారు. అఖిల భారత శివాలయ కూటమి సంస్థ అధ్యక్షుడు డా.అఘోరి గురురామరాజ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. జాతీయ కార్యదర్శి ధనశేఖర్, కోశాధికారి అరుల్‌జ్యోతి, ఉప సెక్రటరీ శ్రీధర్, కాంచీపురం జిల్లా సెక్రటరీ కన్నన్, ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు శింగారవేలన్ తదితరులు పాల్గొన్నారు.

హొగెనేకల్ వద్ద పెరిగిన ఇన్‌ఫ్లో



హొగెనేకల్ వద్ద నీటి ఉధృతి

పెరంబూర్, సెప్టెంబరు 15: హొగెనేకల్ జలపాతాల వద్ద నీటి ప్రవాహం 19వేల ఘనపుటడుగులకు పెరిగింది. కావేరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కావేరి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. మూడు రోజులుగా సెకనుకు 14వేల ఘనపుటడుగులున్న నీరు, శనివారం 17వేలు, ఆదివారం ఉదయం 19వేల ఘనపుటడుగులకు పెరిగింది. కావేరి నదిలో నీటి ప్రవాహం అధికంగా కావడంతో హొగెనేకల్ ప్రధాన జలపాతం, సినీ ఫాల్స్, ఐందరువి, జవార్‌పాణి తదితరజలపాతాల్లో స్నానాలకు నిషేధం విధించారు.

మేట్టూరు డ్యాం....

సేలం జిల్లా మేట్టూరు డ్యాం 14,629 ఘనపుటడుగులకు పెరిగింది. కావేరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మేట్టూరు డ్యాంకు శనివారం సాయంత్రం 13,217 ఘనపుటడుగులున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా 14,629 ఘనపుటడుగులకు పెరిగింది. డ్యాం నుంచి డెల్టా జిల్లాల సాగుకు సెకనుకు 23,700 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 80.11 టీఎంసీల నీరుంది.

యాక్షన్ సన్నివేశాలు లేని మూవీ 'మెయ్యళగన్'

● ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో కార్తీ



'మెయ్యళగన్' ప్రీరిలీజ్ ఈవెంట్

తాను నటించిన కొత్త చిత్రం 'మెయ్యళగన్' ఒక్క యాక్షన్ సన్నివేశం లేని పక్కా కమర్షియల్ చిత్రమని హీరో కార్తీ అన్నారు. 2డి ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై సూర్య, జ్యోతిక దంపతులు కలిసి నిర్మించారు. '96' ఫేం ప్రేమ్‌కుమార్ దర్శకుడు. సీనియర్ నటులు అరవింద్ స్వామి, రాజ్‌కిరణ్ ముఖ్య పాత్రలు పోషించారు. శ్రీదివ్య హీరోయిన్‌గా ఇతర పాత్రల్లో దేవదర్శిని, జేపీ తదితరులు నటించారు. ఈ నెల 27న విడుదలకానున్న చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా, శనివారం రాత్రి నగరంలో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో కార్తీ మాట్లాడుతూ, 'ఈ స్క్రిప్టు చదివేటపుడే నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ప్రతి ఒక్కరికీ ఒక తపన ఉంటుంది. దీపావళి, సంక్రాంతి ఇలా ముఖ్యమైన పండుగలకు తమతమ సొంతూళ్ళకు వెళ్తారు. ఆ సమయంలో చెన్నై నగరం బోసిబోయి కనిపిస్తుంది. అలాంటి ఒక మంచి కథ. ఈ సినిమా అంతా అరవింద్ స్వామిని హింసించే పాత్ర' అన్నారు. అరవింద్ స్వామి మాట్లాడుతూ, 'ఇందులో నన్ను దృష్టిలో ఉంచుకుని నా పాత్ర రాసిన దర్శకుడికి ధన్యవాదాలు. ఇది నా జీవిత కథ. ఈ స్టోరీ నన్ను అంతలా ప్రభావితం చేసింది. సినిమా విడుదలైన తర్వాత అన్ని విషయాలు మాట్లాడుతాను. కార్తీతో షూటింగ్ సమయంలోనే కాదు.. నిజ జీవితంలోనూ మంచి సంబంధాలున్నాయన్నారు. దర్శకుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, '96' చిత్రం తర్వాత ఇపుడే మీడియా ముందుకు వచ్చాను. గత యేడాది నవంబరు నెలలో షూటింగ్ ప్రారంభించి, సెప్టెంబరులో అంటే ఒక యేడాది కాలంలోనే రిలీజ్ చేస్తున్నాం. ఇటీవలకాలంలో సోషల్ మీడియాలో విద్వేషపూరిత కామెంట్స్ పెరిగిపోతున్నాయి. వీటికి ప్రేమ ఫుల్‌స్టాప్ పెడుతుంది. ఈ చిత్రం ప్రేమను పంచే మూవీ. టైటిల్ నుంచి ప్రతి విషయంలోనూ తమిళంకు ప్రాధాన్యత ఇచ్చాం. కారణం.. క్రమంగా తమిళ భాష మన నుంచి దూరమైపోతుందన్నారు. ఆ తర్వాత హీరోయిన్ శ్రీదివ్య, సంగీత దర్శకుడు గోవింద్ వసంత్, ఇతర టెక్నీషియన్లు ప్రసంగించారు.

కోలీవుడ్‌లో హేమ కమిషన్ అక్కర్లేదు

● ఐశ్వర్య రాజేష్

చిత్రజ్యోతి



తమిళ చిత్రసీమలో ఎన్నడు కూడా హీరోయిన్లు లైంగిక వేధింపులకు గురైన సందర్భాలు ఎక్కడా కనిపించలేదని అందువల్ల మలయాళ చిత్రపరిశ్రమలో ఏర్పాటు చేసినట్టుగా జస్టిస్ హేమ కమిషన్ ఇక్కడ అక్కర్లేదని హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ అభిప్రాయపడ్డారు. నగరంలో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ అంశాలు ఎక్కడా చోటుచేసుకోలేదు. ఈ విషయాన్ని నేను గట్టిగా నమ్ముతాను. తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషా చిత్రాల్లో నేను నటించాను. నేను ఏనాడు కూడా ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోలేదు. అందువల్ల జస్టిస్ హేమ కమిషన్ ఇక్కడ అక్కర్లేదు అన్నది నా వ్యక్తిగత భావన. తమిళ చిత్రపరిశ్రమ సాఫీగా సాగిపోతుంది. మహిళల భద్రత చాలా ముఖ్యం. ఎవరైనా మహిళలను వేధించే వారిని కఠినంగా శిక్షించాలి' అని పేర్కొన్నారు.

నా సిద్ధాంతాలతో ఏకీభవించే వారితో పనిచేస్తా

● 'లెజెండ్' శరవణన్


మహిళలతో 'లెజెండ్' శరవణన్

సమయం, సందర్భం, పరిస్థితులు అనుకూలిస్తే రాజకీయాల్లోకి వస్తానని, తన సిద్ధాంతాలతో ఏకీభవించే పార్టీలో కలిసి పనిచేస్తానని ప్రముఖ జౌళి వ్యాపారవేత్త, హీరో 'లెజెండ్' శరవణన్ అన్నారు. ఆయన నటించే కొత్త చిత్రం తూత్తుకుడిలో ప్రారంభమైంది. ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు ఆయన శనివారం చెన్నై నుంచి తూత్తుక్కుడి వెళ్ళారు. ఈ సందర్భంగా చెన్నై ఎయిర్‌పోర్టు లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'నేను ఎల్లవేళలా ప్రజా సంక్షేమం గురించి ఆలోచన చేస్తూ, శ్రద్ధ వహిస్తాను. సమయం, వాతావరణం, పరిస్థితులు అనుకూలిస్తే తప్పకుండా రాజకీయాల్లోకి వస్తాను. 2026లో జరిగే ఎన్నికల్లో గట్టి పోటీ ఉంటుంది. నా సిద్ధాంతాలతో ఏకీభవించే పార్టీలతో కలిసి పనిచేస్తాను. ముఖ్యమంత్రి స్టాలిన్ తన విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని నగరానికి చేరుకోవడం సంతోషం. ఇకపోతే, నా కొత్త చిత్రానికి దురై సెంథిల్ కుమార్ దర్శకుడు. జిబ్రాన్ సంగీతం. అనేక మంది నటీనటులు నటిస్తున్నారు. తూత్తుక్కుడితో పాటు ఉత్తర భారతం, విదేశాల్లో చిత్రీకరించనున్నాం. వీలైనంత త్వరగా షూటింగ్ పూర్తిచేసి వచ్చే యేడాది ఏప్రిల్‌లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కించే ఈ చిత్రానికి టైటిల్‌ను త్వరలోనే ఖరారు చేస్తాం' అని వివరించారు.

'అమరన్' డబ్బింగ్ పూర్తి


డబ్బింగ్ స్టూడియోలో శివకార్తికేయన్, రాజ్‌కుమార్ పెరియస్వామి

శివకార్తికేయన్ హీరోగా నటించిన 'అమరన్' చిత్రం డబ్బింగ్ పూర్తయినట్టు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను దీపావళి సందర్భంగా విడుదల చేయనున్నట్టు తెలిపింది. సోనీ పిక్చర్‌తో కలిసి విశ్వనటుడు కమల్ హాసన్ రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించారు. 'రంగూన్' ఫేం రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకుడు. ఆర్మీ మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత సంఘటనలు, రాహుల్ సింగ్, శివ్ అరూర్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ : ట్రూ స్టోరీస్ ఆఫ్ మోడరన్ మిలిటరీ' పుస్తకం ఆధారంగా ఈ స్క్రిప్టు సిద్ధం చేశారు. శివకార్తికేయన్ సైనికుడి పాత్రలో నటించారు. ఈ సినిమా డిజిటల్ హక్కులను ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్ రూ.55 కోట్లకు కొనుగోలు చేసుకున్నట్టు సమాచారం. సాయిపల్లవి హీరోయిన్. అక్టోబరు 31వ తేదీన విడుదలయ్యే ఈ చిత్రం డబ్బింగ్ పూర్తయినట్టు చిత్రబృందం ప్రకటించింది.

తిరుచ్చెందూరు ఆలయంలో విశాల్

ప్యారీస్, సెప్టెంబరు 15: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన తూత్తుకుడి జిల్లా తిరుచ్చెందూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రముఖ సినీ నటుడు విశాల్ శనివారం దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, ప్రధాన పూజారులు స్వాగతం పలికారు. ఆ తర్వాత మూలవర్ అభిషేకం, అలంకారం, దీపారాధన పూజలు చేసి, స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత షణ్ముఖనాధర్, శత్రుసంహార మూర్తి సన్నిధుల్లో పూజలు చేశారు. విశాల్ ఆలయానికి వెళ్ళిన విషయం తెలిసి ఆయన అభిమానులు ఆలయం వెలుపల భారీగా గుమికూడారు. విశాల్‌ను తిరుచ్చి ఆధీనం ఆలయ అధికారులతో కలిసి గౌరవంగా సత్కరించారు.


ఆలయ ప్రధాన అర్చకులతో నటుడు విశాల్

శ్రీరంగంలో పవిత్రోత్సవాలు ప్రారంభం


రంగనాథస్వామి ఆలయంలో యాగపూజలు

ప్యారీస్, సెప్టెంబరు 15: తిరుచ్చి జిల్లా శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయంలో శ్రావణ - పురటాసి నెల పవిత్రోత్సవం శనివారం ప్రారంభమైంది. మొత్తం 9 రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. శనివారం ఉదయం నంపెరుమాళ్ మూలస్థానం నుంచి బయలుదేరి యాగశాలకు చేరారు. అనంతరం ప్రత్యేక పూజలు అందుకున్న ఆయన.. సాయంత్రం 5 గంటలకు మళ్ళీ మహామండపం చేరుకోగా ఆలయ పూజారులు తిరుమంజనం జరిపించారు. పవిత్రాలు, పూలు సమర్పించిన అనంతరం రాత్రి 11 గంటలకు స్వామివారిని మూలస్థానానికి చేర్చారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన పుష్పయాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారిని ప్రత్యేక అంగీలో అలంకరించి దర్శనానికి అనుమతించారు. అలాగే కొండితోపు ముల్లావీధిలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఐదు రోజుల పవిత్రోత్సవాలు యాగపూజలతో ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త జె.హరికుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించి, ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా జాతీయ ఇంజనీర్ల దినోత్సవం

● డాక్టర్ వడ్డి శేషగిరి రావుకు సత్కారం


డాక్టర్ వడ్డి శేషగిరి రావుకు సత్కార దృశ్యం

ప్యారీస్, సెప్టెంబరు 15: నగరంలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా తమిళనాడు రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చేపాక్‌లోని సంస్థ కార్యాలయంలో ఉదయం ప్రార్థనా గీతం, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.రంగనాథ్, విశిష్ట అతిథిగా వి టెక్నాలజీస్ సీఈవో చాకో వల్లియప్ప హాజరై ప్రసంగించారు. షోళింగనల్లూరులోని సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్డి శేషగిరి రావు సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమంలో 'శ్రీ వల్లియప్ప ఎమినెంట్ ఇంజనీరింగ్ అవార్డు-2024' అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.కార్తికేయన్, సంస్థ గౌరవ కార్యదర్శి డి.గోకుల్, పలు ప్రభుత్వ, ప్రైవేటు శాఖల ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల వేడుక

కోలాహలంగా ఓనం పండుగ



కోవై అయ్యప్పస్వామి ఆలయంలో రంగవల్లికలు వేస్తున్న మలయాళీయులు - కేరళ సంప్రదాయ నృత్యం చేస్తున్న యువతులు

పెరంబూర్, సెప్టెంబరు 15: రాష్ట్రంలో మలయాళీలు నివసించే నగరాల్లో 'ఓనం' పండుగను ఆదివారం కోలాహలంగా జరుపుకున్నారు. కేరళ రాష్ట్ర సంప్రదాయ పండుగల్లో ఓనం ప్రధానమైనది. రాష్ట్రంలో కేరళ ప్రజలు అధికంగా నివసించే చెన్నై, కోయంబత్తూర్, కన్నియాకుమారి, నీలగిరి సహా పలు జిల్లాల్లో ఓనం పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. కోయంబత్తూర్‌లోని అయ్యప్పస్వామి ఆలయాన్ని తెల్లవారుజామున 5 గంటలకు తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 2 వేల కిలోల పూలతో అత్తిపూల రంగవల్లికలు తీర్చిదిద్దారు. ఈ వేడుకల్లో మలయాళీలు సంప్రదాయ దుస్తులు ధరించారు. అలాగే, నీలగిరి జిల్లా ఊటీ, కూడలూరు, పందలూరు, సేరంబాడి తదితర ప్రాంతాల్లోనూ ఓనం వేడుకలు జరిగాయి. కేరళ సంప్రదాయ దుస్తులు ధరించిన ఆ రాష్ట్ర ప్రజలు నృత్యాలతో సందడి చేశారు.



విజేతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

సీకేఎల్ విజేతలు వీరే

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'చెన్నై కాల్బందు లీగ్ (సీకేఎల్) సీజన్-4 విజేతలుగా సైదాపేట ప్రభుత్వ మోడల్ బాలుర మహోన్నత పాఠశాల, మాధవరంలోని జయగోపాల్ గరోడియా బాలికల మహోన్నత పాఠశాల నిలిచాయి. ఈ నెల 9వ తేదీన నెహ్రూపార్క్‌లోని ఎస్‌డీఏటీ మైదానంలో అండర్-14 కేటగిరీలో మొత్తం 36 టీంలు పాల్గొన్న ఈ ఫుట్‌బాల్ టోర్నీలో 46 మ్యాచ్‌లు నిర్వహించారు. బాలుర టోర్నీలో సైదాపేట ప్రభుత్వ మోడల్ బాలుర మహోన్నత పాఠశాల, బాలికల టోర్నీలో జయగోపాల్ గరోడియా బాలికల మహోన్నత పాఠశాల నిలిచాయి. శనివారం రాత్రి విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది. అర్జున అవార్డీ గ్రహీత జోత్స్న చినప్ప, రైఫిల్ స్వర్ణ పతక విజేత కార్తీక్ శబరి రాజ్ విజేతలను సత్కరించి, కప్ అందించారు. ఈ కార్యక్రమంలో లాటెంట్‌వ్యూ అనలిటిక్స్ వ్యవస్థాపకులు వెంకట్ విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కుంభాభిషేకానికి ముస్లింల సారె

● తిరుప్పూర్ జిల్లాలో వెల్లివిరిసిన మతసామరస్యం

పెరంబూర్, సెప్టెంబరు 15: తిరుప్పూర్ జిల్లాలో మతసామరస్యం వెల్లివిరిసింది. 'హిందూముస్లిం భాయ్ భాయ్' అన్నదానిని నిజం చేస్తూ ఆ జిల్లాకు చెందిన ముస్లింలు ఆదికేశవ పెరుమాళ్ ఆలయ కుంభాభిషేకానికి సారె తీసుకురావడం విశేషం. తిరుప్పూర్ జిల్లా మంగలంలో వున్న శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవ పెరుమాళ్ ఆలయ కుంభాభిషేకం ఆదివారం జరిగింది. సంప్రదాయంలో భాగంగా ఈ గ్రామానికి చెందిన 'సున్నతుల్ జమాయత్ పెద్ద మసీదు'కు చెందిన నిర్వాహకులు శ్రీదేవి-భూదేవి సమేత ఆదికేశవ పెరుమాళ్‌కు ఏడు రకాల సారె తీసుకువచ్చారు. మేళతాళాలు బాజాభజంత్రీల నడుమ ఊరేగింపుగా వచ్చిన ముస్లింలు భక్తిశ్రద్ధలతో స్వామివారికి సారె సమర్పించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారిని సాదరంగా స్వాగతించి, ప్రసాదాలు పంపిణీ చేశారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమం పట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

మూడు సంస్థలకు 'చిన్నికృష్ణన్ ఇన్నోవేషన్ అవార్డు'


అవార్డుల ప్రదానోత్సవం

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వినూత్న ఆవిష్కరణల ద్వారా వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంతో పాటు దాగివున్న ప్రతిభను గుర్తించడం లక్ష్యంగా పెట్టుకున్న మూడు సంస్థలకు 'కెవినోకేర్, మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎంఎంఏ) సంయుక్తంగా ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన 'చిన్నికృష్ణన్ ఇన్నోవేషన్ అవార్డు' బహూకరించాయి. ప్రతి విజేతకు ట్రోఫీ, ప్రశంసాపత్రంతో పాటు రూ.లక్ష నగదు బహుమతి అందించాయి. ఈ కార్యక్రమానికి కోల్గేట్-పామోలివ్ (ఇండియా) లిమిటెడ్ ఎండీ ప్రభా నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరై దివంగత చిన్నికృష్ణన్ జ్ఞాపకార్థం 'చిన్నికృష్ణన్:ఫాదర్ ఆఫ్ ద సాచెట్ రెవల్యూషన్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎఫ్‌ఎంసీజీ పరిశ్రమకు నేతృత్వం వహించిన ఆర్.చిన్నికృష్ణన్ ఆవిష్కరణలకు గుర్తుగా 2011లో స్థాపించబడిన ఈ అవార్డు ఇప్పటి వరకూ దేశంలోని 36 సంస్థలను వరించింది. ఈ ఏడాదికి గాను శనివారం రాత్రి చెన్నైలో జరిగి కార్యక్రమంలో 'ఆక్సియో బయోసొల్యూషన్స్', 'గోడు గుడ్ స్టూడియో', 'అర్బన్ ఎయిర్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థలకు నిర్వాహకులు ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కెవిన్‌కేర్ ఛైర్మన్ సీకే రంగనాధన్ మాట్లాడుతూ.. ఆవిష్కరణలు సృజనాత్మకతను రేకెత్తించడమే కాకుండా క్లిష్టమైన వాస్తవ ప్రపంచ సవాళ్లను కూడా పరిష్కరించిన అసాధారణ వ్యక్తులను సత్కరించుకోవడం తమకు గౌరవప్రదమన్నారు.

విద్యాభివృద్ధికి కట్టుబడివున్నాం

● అంబత్తూర్ ఎమ్మెల్యే జోసఫ్


ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జోసఫ్, నటి దేవయాని తదితరులు

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి వుందని, ప్రభుత్వ, ప్రైవేటు పరంగానూ విద్యాభివృద్ధికి కృషి చేసే సంస్థలకు తాము అన్ని విధాలా సహకరిస్తామని అంబత్తూరు ఎమ్మెల్యే జోసఫ్ సామ్యూయేల్ పేర్కొన్నారు. డాక్టర్ మెహతా గ్రూపు సంస్థల ఆధ్వర్యంలో శనివారం నోలంబూరులో డాక్టర్ మెహతాస్ ఇంటర్నేషనల్ స్మార్ట్ స్కూల్‌ను సినీనటి దేవయానితో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెహతా సంస్థల సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంకా నటి దేవయానితో పాటు మెహతాస్ గ్రూపు సంస్థల నిర్వాహకులు దిలీప్ మెహతా, సమీర్ మెహతా తదితరులు పాల్గొన్నారు. కాగా అక్టోబరు 1 నుంచి ఈ స్మార్ట్ స్కూల్‌లో తరగతులు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

బై బై... గణేశా





● నేత్రపర్వంగా శోభాయాత్ర
● నగరంలో 1,500 విగ్రహాల నిమజ్జనం
● 16,500 మంది పోలీసుల నిఘా

ప్యారీస్, సెప్టెంబరు 15: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో కీలకఘట్టమైన శోభాయాత్ర, నిమజ్జనం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. నగరంలో ఎటుచూసినా వివిధ ఆకృతులతో సుందరంగా రూపొందించిన లంబోధరుడి విగ్రహాలు, వాటిని తరలిస్తున్న భక్తులే కనిపించారు. ఉత్తర చెన్నై, సెంట్రల్ చెన్నై, దక్షిణ చెన్నై ప్రాంతాల్లో ప్రత్యేక పందిళ్లలో పెట్టిన 1,500 గణనాథుడి విగ్రహాలకు 9 రోజులు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పూజలు నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ కార్యాలయం గణపయ్య విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సాగాల్సిన రూట్ మ్యాప్ ముందుగానే విడుదల చేసింది. అనుమతించిన ప్రాంతాల మీదుగా భారీ విగ్రహాలను ఊరేగింపుగా సముద్రతీర ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రథమ సముద్రతీరాలైన పట్టణంబాక్కం, శ్రీనివాసపురం, నీలాంగరై, తిరువొత్తియూర్, కాశిమేడు ఫిషింగ్ హార్బర్లలో ఉదయం 7 గంటల నుంచే నిమజ్జన కార్యక్రమం ప్రారంభమైంది. పలు ప్రాంతాల నుంచి డప్పు చప్పుళ్ళు, యువత నృత్యాలు, భక్తుల 'గణపతి బొప్ప మోరియా' నినాదాల నడుమ పార్వతి తనయుడిని గంగమ్మ ఒడిలోకి సాగనంపారు.







పోలీసుల నిఘా...

శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 16,500 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు. నిమజ్జనానికి అనుమతించిన నాలుగు ప్రాంతాల్లో భారీ విగ్రహాలను సముద్రతీరానికి తరలించేందుకు 90 అడుగుల ఎత్తు ట్రాలీ ఏర్పాటుచేశారు. నిమజ్జనం సమయంలో విగ్రహాల వెంట వచ్చిన భక్తులు నీటిలో మునిగిపోకుండా గజ ఈతగాళ్లు, పోలీసులు వ్యవహరించారు. అదే విధంగా సముద్రతీరాల్లో వాచ్ టవర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి భక్తుల కదలికలు పర్యవేక్షించారు. నిమజ్జనం దృశ్యాలను భక్తులు సులువుగా వీక్షించేలా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. అగ్నిమాపక సిబ్బంది, వైద్య బృందాలు కూడా తమవంతు సేవలందించారు.